క్లుప్తంగా

ఒప్పంద అధ్యాపకుల రెన్యువల్‌కు ఆహ్వానం

సాలూరు: 2025–26 విద్యాసంవత్సరానికి జిల్లాలో గల ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో ఒప్పంద ప్రాతిపదికన పనిచేస్తున్న అధ్యాపకులను రెన్యువల్ చేసేందుకు దరఖాస్తులు కోరుతున్నట్లు జిల్లా ఐడీ కళాశాల సాలూరు ప్రిన్సిపాల్ డా.కె.ఉషశ్రీ ఓ ప్రకటనలో గురువారం తెలిపారు. 2024–25 విద్యాసంవత్సరంలో 30 ఏప్రిల్ 2025 నాటికి ఒప్పంద అధ్యాపకులుగా పనిచేసిన వారు మాత్రమే దరఖాస్తు చేసుకునేందుకు అర్హులని స్పష్టంచేశారు. దరఖాస్తులను శనివారం సాయంత్రం 5 గంటలలోపు సంబంధిత కళాశాలలోనే సమర్పించాలని సూచించారు. జిల్లా సెలక్షన్ కమిటీ సమక్షంలో ఈ నెల 21 నుంచి 23వ తేదీలోపు కౌన్సెలింగ్ నిర్వహించి రెన్యువల్ చేస్తామన్నారు. 24వ తేదీన అగ్రిమెంట్ చేసుకోవాల్సి ఉంటుందని స్పష్టం చేశారు.

పారిశుధ్య పక్షోత్సవాల ర్యాలీ



సీతంపేటలో అవగాహన ర్యాలీ

సీతంపేట: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మండల ప్రత్యేకాధికారి జి.చిన్నబాబు అన్నారు. ఈ మేరకు మండల కేంద్రంలో పారిశుధ్య పక్షోత్సవాల ర్యాలీ గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ ఆరిక కళావతి, పంచాయతీ కార్యదర్శి రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

రోగులకు నాణ్యమైన వైద్యసేవలు



నూతన భవనాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జయకృష్ణ, పీఓ యశ్వంత్‌కుమార్‌రెడ్డి

సీతంపేట: రోగులకు నాణ్యమైన వైద్యసేవలు అందించాలని ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ, ఐటీడీఏ పీఓ సి.యశ్వంత్‌కుమార్ రెడ్డి సూచించారు. గురువారం స్థానిక ఏరియా ఆస్పత్రిలో సీఆర్మ్ (ఆర్థో) మెషీన్‌తో పాటు నూతనంగా నిర్మించిన పలు వార్డులను ప్రారంభించారు. ఈ సందర్భంగా రోగులకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. ఆస్పత్రి అదనపు భవనాలు పూర్తయితే గిరిజనులకు మరిన్ని వైద్యసేవలు అందుతాయన్నారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ బి.శ్రీనివాసరావు, ఆర్ఎంఓ డీవీ శ్రీనివాస్, మార్కెటింగ్ కమిటీ చైర్‌పర్సన్ బి.సంధ్యారాణి పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తం



అవగాహన కల్పిస్తున్న ఏఎస్సై సంజీవ్

సీతంపేట: సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఏఎస్సై సంజీవ్ అన్నారు. గురువారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సంకల్పం కార్యక్రమంలో భాగంగా సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. అనంతరం ట్రాఫిక్ నిబంధనలపై వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సుశాంత్ జనా, వైస్ ప్రిన్సిపాల్ ప్రభాకరావు, తదితరులు పాల్గొన్నారు.

ఆశ్రమ పాఠశాల సందర్శన



వంటలు పరిశీలిస్తున్న ఏపీఓ చిన్నబాబు

సీతంపేట: మండలంలోని చిన్నబగ్గ గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాలను ఐటీడీఏ ఏపీఓ సి.యశ్వంత్‌కుమార్ రెడ్డి గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి, రుచికరమైన భోజనం విద్యార్థులకు అందించాలని సూచించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడి వారి సామర్థ్యాలను అంచనా వేశారు. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని సూచించారు.

నియామకం..



పాపినాయుడు

పాలకొండ: వైఎస్సార్ సీపీ పాలకొండ నియోజకవర్గ ఎంప్లాయీస్, పెన్షనర్ల అధ్యక్షుడిగా దుప్పాడ పాపినాయుడు నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి గురువారం సాయంత్రం ఉత్తర్వులు వెలువడ్డాయి. ఈ సందర్భంగా పాపినాయుడు మాట్లాడుతూ.. పార్టీ తనపై నమ్మకం ఉంచి అప్పగించిన బాధ్యతలను చిత్తశుద్ధితో నెరవేరుస్తానని తెలిపారు. తనకు అవకాశం కల్పించిన ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతిలకు కృతజ్ఞతలు తెలిపారు.

అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు

సీతంపేట: ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవని విజిలెన్స్ సీఐ కె. చంద్రశేఖరరావు అన్నారు. మండల కేంద్రంలోని పలు ఎరువుల దుకాణాలను గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులు, నిల్వలను పరిశీలించి, యజమానులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఏఓ వాహిని పాల్గొన్నారు.



ఎరువుల దుకాణంలో రిజిస్టర్లు, ఎరువులు పరిశీలిస్తున్న సీఐ, తదితరులు

సరైన పత్రాలు లేకుండా అమ్మకాలు చేయరాదు

భామిని: ఎరువులు, క్రిమి సంహారక మందులకు సంబంధించి సదరు కంపెనీల నుంచి సరైన పత్రాలు పొందకుండా విక్రయాలు చేపట్టరాదని రాజాం విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ పి. రమణయ్య అన్నారు. వ్యవసాయశాఖ రాజాం ఏడీఏ చంద్రశేఖరరావు సమక్షంలో భామిని మండలం సింగిడి, బత్తిలిలలో గల ఎరువులు, పురుగు మందుల దుకాణాలను పరిశీలించారు. కార్యక్రమంలో పాలకొండ ఏడీఏ కె. రత్నకుమారి, భామిని ఏఓ కొల్లి తిలక్, మన్యం టెక్నికల్ ఏఓ రవీంద్ర, వ్యవసాయ సహాయకులు దుర్గాప్రసాద్, ఈశ్వర్, దినేష్ పాల్గొన్నారు.

లైసెన్స్‌లు రద్దు చేస్తాం..

వీరఘట్టం: ఎరువులు అధిక ధరలకు విక్రయిస్తే లైసెన్స్‌లు రద్దు చేస్తామని విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ పి.రమణయ్య అన్నారు. పట్టణంలోని పలు ఎరువుల దుకాణాల్లో గురువారం తనిఖీలు నిర్వహించారు. తనిఖీల్లో ఏడీఏ కె.చంద్రశేఖరరావు, ఏఓ రవీంద్ర, వీరఘట్టం మండల శాఖాధికారి ఎ.సౌజన్య ఉన్నారు.

పాలకొండలో..

పాలకొండ/పాలకొండ రూరల్: పట్టణంలోని వైఎస్సార్ కూడలి వద్ద ఉన్న ఎరువుల దుకాణాల్లో విజిలెన్స్, వ్యవసాయశాఖ అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఏ చంద్రరావు మాట్లాడుతూ.. ఎరువులు కృత్రిమ కొరత సృష్టిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో పాలకొండ ఏడీఏ రత్నకుమారి, ఏఓలు రవీంద్ర, ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.



పాలకొండ రూరల్: ఎరువుల దుకాణంలో తనిఖీలు చేస్తున్న అధికారులు



వీరఘట్టంలో : ఎరువుల దుకాణంలో తనిఖీ చేస్తున్న అధికారులు



భామిని: సింగిడిలో ఎరువుల నిల్వలను పరిశీలిస్తున్న అధికారులు

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

పాలకొండ రూరల్: మండలంలోని నవగాం ఫీడర్ పరిధిలో 11 కేవీ విద్యుత్ లైన్ల నిర్వహణ పనులు చేపట్టనున్న నేపథ్యంలో శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు సరఫరా ఉండదని ట్రాన్స్‌కో ఈఈ కె. విష్ణుమూర్తి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల పరిధిలోని పనుకువలస, తుమరాడ, చింతాడ, దుగ్గి, నక్కలపేట, అట్టలి, వాటపాగు, టీడీ.పారాపురం, టీకే.రాజపురం, పొట్టిలి, ఆర్‌బీఆర్ పేట, ఎం.సింగుపురం, మల్లివీడు, జంపరకోట, అవలంగి, బడ్డమాసింగి, తదితర గ్రామాలకు సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

జియ్యమ్మవలస రూరల్: మండలంలోని చినకుదమ సబ్‌స్టేషన్ పరిధిలోని పలు గ్రామాలకు శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతున్నట్లు ఆ శాఖ అధికారులు రాజేంద్ర, శంకరరావులు ఓ ప్రకటనలో గురువారం తెలిపారు. విద్యుత్ మరమ్మతులు సహా నందివానివలస నుంచి చినకుదమ వరకు విద్యుత్ వైర్లను తాకే చెట్లకొమ్మల తొలగింపు పనుల నేపథ్యంలో చినకుదమ, పెదకుదమ, సింగనాపురం, చింతలబెలగాం, గౌరీపురం, తురకనాయుడువలస తదితర గ్రామాలకు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. విద్యుత్ వినియోగదారులంతా ఈ విషయాన్ని గమనించి సహకరించాలని వారు కోరారు.

గిరిజనులతోనే సీఆర్‌టీ పోస్టుల భర్తీ



మాట్లాడుతున్న గిరిజన సంఘాల జేఏసీ నాయకులు

సీతంపేట: గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాల్లో సీఆర్‌టీ ఉపాధ్యాయ పోస్టులను గిరిజనులతో మాత్రమే భర్తీ చేయాలని గిరిజన సంఘాల జేఏసీ నాయకులు బి.శ్రీనివాసరావు, బి.ఉమామహేశ్వరరావు, తదితరులు కోరారు. గురువారం వారు మాట్లాడుతూ.. ఈ విషయమై ఐటీడీఏ పీఓకు వినతిపత్రం అందజేశామన్నారు. 2017 నుంచి అన్ని రకాల అర్హతలున్న గిరిజన అభ్యర్థులను కాదని.. ఎటువంటి అర్హతలు లేని గిరిజనేతరులను నియమించారన్నారు.

శంకుస్థాపన

పాలకొండ రూరల్: డివిజన్ కేంద్రమైన పాలకొండలో అగ్నిమాపక కేంద్రం నూతన భవన నిర్మాణానికి ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కోటీ 34 లక్షల రూపాయల వ్యయంతో భవనం నిర్మించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో జిల్లా ఫైర్ అధికారి సింహాచలం, స్థానిక అగ్నిమాపక అధికారి జామి సర్వేశ్వరరావుతో పాటు స్థానిక కూటమి నాయకులు పాల్గొన్నారు.

బదిలీ ఉద్యోగులకు సన్మానం

పాలకొండ: పాలకొండ రెవెన్యూ శాఖలో విధులు నిర్వహించి ఇతర ప్రాంతాలకు బదిలీపై వెళ్లిన ఉద్యోగులకు గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో సన్మానించారు. బలిజిపేట బదిలీపై వెళ్లిన తహసీల్దార్ బాలమురళీకృష్ణకు.. సీతంపేట బదిలీపై వెళ్లిన సీఎస్‌డీటీ నర్సింగరావుకు.. ఉద్యోగోన్నతిపై పార్వతీపురం వెళ్లిన వీర్వోలు బలివాడ శ్రీనివాసరావు, కోట శ్రీనివాసరావులను రెవెన్యూ సిబ్బంది ఘనంగా సత్కరించారు. వీఆర్వోల సంఘ జిల్లా నాయకులు బంకిరాజా, వంజరాపు ఈశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన జరిగిన ఈ సన్మాన కార్యక్రమంలో తహసీల్దార్ రాధాకృష్ణమూర్తి, ఎస్సై ప్రయోగమూర్తిలతో పాటు పలువురు ప్రజాపతినిధులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



తహసీల్దార్‌ను సన్మానిస్తున్న రెవెన్యూ సిబ్బంది

ఏ క్షణమైనా ప్రమాదం తప్పదు..



డివిజన్ కేంద్రమైన పాలకొండలో మండల వ్యవసాయాధికారి కార్యాలయం ఏ క్షణమైనా కూలిపోయేందుకు సిద్ధంగా ఉంది. భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరుకోవడంతో ఎప్పుడు ఏం జరుగుతుందోనని సిబ్బంది భయం భయంగా విధులు నిర్వహిస్తున్నారు. గోడలు పూర్తిగా బీటలుదేరాయి. భవనం వెనుక ఉన్న మరో గదిలో రికార్డులు, వ్యవసాయ పరికరాలు భద్రపరిచారు. ఈ గది కూడా అవశాన దశకు చేరుకోవడంతో పాములకు ఆవాసంగా మారింది. ఉన్నతాధికారులు స్పందించి కార్యాలయాన్ని వేరొక చోటుకు మార్చి.. కొత్త భవనం నిర్మించాలని సిబ్బంది, రైతులు కోరుతున్నారు.

–పాలకొండ రూరల్

నేడు మండల సర్వసభ్య సమావేశం

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): కురుపాం మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం శుక్రవారం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో జె.ఉమామహేశ్వరి ఓ ప్రకటనలో గురువారం తెలిపారు. ఎంపీపీ శెట్టి పద్మావతి అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి ప్రజాప్రతినిధులంతా వస్తున్నారని, మండల స్థాయి అధికారులంతా అభివృద్ధి నివేదికలతో సమావేశానికి హాజరుకావాలని ఆమె కోరారు.

గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

పాలకొండ: గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మండల ప్రత్యేకాధికారి శివ్వాల మన్మధరావు అన్నారు. మండలంలోని కొండాపురంలో స్వచ్ఛ సేవా కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. పశువులను రోడ్లపై కట్టవద్దని సూచించారు. చెత్తను కాలువల్లో వేయకుండా గ్రీన్ అంబాసిడర్లకు అందించాలన్నారు. అనంతరం గ్రామంలోని కుట్టు శిక్షణ కేంద్రంను పరిశీలించారు. ఆయనతో పాటు ఎంపీడీఓ విజయరంగారావు, పంచాయతీ కార్యదర్శి పుష్ప, సర్పంచ్ రాయి వనజ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వితరణ



అమ్మవారికి స్టేజ్ అందిస్తున్న శ్రీకాకుళంనకు చెందిన భక్తులు

పాలకొండ రూరల్: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం పాలకొండ కోటదుర్గమ్మ ఆలయానికి రూ. 55 వేల విలువ చేసే స్టేజ్‌ను శ్రీకాకుళం జిల్లాకు చెందిన పసగాడ హేమసుందర్, సుధారాణి, పాలిశెట్టి మురళీకృష్ణ, ప్రభావతి దంపతులు గురువారం అందజేశారు. ఈఓ వీవీ సూర్యనారాయణ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రధానార్చకుడు దార్లపూడి లక్ష్మీప్రసాద్ శర్మ మాట్లాడుతూ.. ఈ నెల 22 నుంచి శ్రీమదాంధ్ర మహా భాగవత సప్తాహ పారాయణ కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు. దాతలు అందించిన స్టేజ్‌ను ప్రత్యేక కార్యక్రమాల్లో వినియోగిస్తామని చెప్పారు.

మత్తు పదార్థాలకు దూరం

భామిని: విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని పాలకొండ డీఎస్పీ రాంబాబు పిలుపునిచ్చారు. గురువారం స్థానిక ఏపీ మోడల్ స్కూల్‌లో బత్తిలి ఎస్సై జి. అప్పారావు ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ.. మత్తుకు అలవాటు పడితే జీవితాలు చిత్తవుతాయని చెప్పారు. అలాగే గుడ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కల్పించారు. మైనర్లు ద్విచక్ర వాహనాలు నడపం చట్టరీత్యా నేరమన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బాబూరావు, వైస్ ప్రిన్సిపాల్ వసూదరాణి, మహిళా పోలీస్ చందన పట్నాయక్, విద్యార్థులు పాల్గొన్నారు.

గిరిజనులకు నాణ్యమైన సరుకులు



సరుకులు కొనుగోలు చేస్తున్న గిరిజనులు

భామిని: ఆదివాసీ గిరిజనులకు గిరి బజార్ వాహనాలతో నాణ్యమైన నిత్యావసర సరుకులు విక్రయిస్తున్నట్లు వెలుగు డీపీఎం ఆర్‌వీ రమణ, ఏపీఎం మీసాల చక్రపాణి తెలిపారు. గురువారం స్థానిక వారపు సంత వద్ద నిత్యావసర సరుకులు విక్రయించారు. గిరిజన చైతన్యం పేరుతో కలెక్టర్ ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని వారు చెప్పారు. కార్యక్రమంలో వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

అవగాహన పెంచుకోవాలి

పాలకొండ రూరల్: విద్యార్థులు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.శ్యాంబాబు అన్నారు. కళాశాల ఆవరణలో శక్తి యాప్, మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలు, సైబర్ నేరాలపై గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో ఏఎస్సై పి.సురేష్‌కుమార్, శక్తి యాప్ సభ్యుడు గణపతి, ఈగల్ సెల్ ప్రతినిధి శ్రీనివాసరావు, ప్రకృతాంబ, వైస్ ప్రిన్స్‌పాల్ బి.జయమణి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలకు గాయాలు

పాలకొండ రూరల్: మండలంలోని తంపటాపల్లి నుంచి వీరఘట్టం మండలం వండువకు ద్విచక్ర వాహనంపై వెళుతున్న భార్యాభర్తలు కె.భూషణరావు, భారతి రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. గురువారం వీరిద్దరూ బైక్‌పై వెళ్తుండగా.. వీరి ముందు వెళ్తున్న ఆటో తంపటాపల్లి కూడలిలో ఒక్కసారిగా కుడివైపునకు తిప్పడంతో ఆటోను ఢీకొని కింద పడ్డారు. వెంటనే స్థానికులు స్పందించి గాయపడిన భార్యాభర్తలను స్థానిక ఏరియా ఆస్పత్రికి తరలించారు. క్షతగాత్రుల ఫిర్యాదు మేరకు ఎస్సై కె. ప్రయోగమూర్తి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ప్రమాదానికి కారణమైన ఆటో బూర్జ మండలానికి చెందినదిగా గుర్తించినట్లు పోలీసులు తెలిపారు.

వివాహిత అదృశ్యం....

మండలంలోని బుక్కూరు గ్రామానికి చెందిన భవన నిర్మాణ కార్మికురాలు ఈ నెల 10న రోజువారీ పనుల నిమిత్తం పాలకొండ వచ్చి తిరిగి స్వగ్రామం చేరుకోలేదు. దీంతో ఆమె భర్త ఆనంద్, కుటుంబ సభ్యులు వెతికినా ఫలితం లేకపోవడంతో గురువారం పాలకొండ పోలీసులను ఆశ్రయించారు. వీరు అందించిన వివరాల మేరకు ఎస్సై మిస్సింగ్ కేసు నమోదు చేశామన్నారు.

బయో గ్రామాలుగా తీర్చిదిద్దాలి



ప్రకృతి వ్యవసాయ విస్తరణపై చర్చిస్తున్న జట్టు ట్రస్టీ పారినాయుడు

గరుగుబిల్లి: ప్రకృతి వ్యవసాయాన్ని మరింత విస్తరింపజేసి, గ్రామాలను బయోగ్రామాలుగా తీర్చిదిద్దాలని జట్టు ట్రస్టీ డి.పారినాయుడు అన్నారు. మండలంలోని తోటపల్లి జట్టు కార్యాలయంలో ఉత్తరాంధ్ర రీజనల్ టెక్నికల్ అధికారి జి.హేమసుందర్, డీపీఎం పి.షణ్ముఖరాజు, ఏపీసీఎన్ఎఫ్ శ్రావణ్‌కుమార్‌లతో ప్రకృతి సేద్యంపై గురువారం చర్చ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్వతీపురం మన్యం జిల్లా ప్రకృతి వ్యవసాయానికి ఎంతో అనుకూలంగా ఉంటుందని నీతి ఆయోగ్ గుర్తించిందని తెలిపారు. శతశాతం ప్రకృతి వ్యవసాయం అమలయ్యేలా కార్యాచరణ చేయాలన్నారు. ఉత్తరాంధ్ర రీజనల్ టెక్నికల్ అధికారి జి.హేమసుందర్ మాట్లాడుతూ జట్టు ట్రస్టు ఆధ్వర్యంలో ఎంతో శ్రమపడి 135 బయోగ్రామాలను తయారు చేశారని, తద్వారా ఈ ప్రాంతానికి గుర్తింపు వచ్చిందన్నారు. బయోగ్రామాలు.. మళ్లీ కెమికల్ గ్రామాలుగా మారకుండా చూసుకోవాల్సిన బాధ్యత ఏపీసీఎన్ఎఫ్ కార్యకర్తలపై ఉందన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

● ఎస్సై కళాధర్

వీరఘట్టం: అపరిచిత వ్యక్తులతో అప్రమత్తంగా ఉండాలని ఎస్సై జి.కళాధర్ సూచించారు. మండలంలోని రేగులపాడు కేజీబీవీలో 'మంచి – చెడు స్పర్శలపై' గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎవరైనా మనకు ఇబ్బంది కలిగేలా ప్రవర్తిస్తే వెంటనే తల్లిదండ్రులకు తెలియజేయాలన్నారు. బాలికలందరూ సెల్ఫ్ డిఫెన్స్ అలవరుచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కేజీబీవీ ఎస్ఓ డి.ఉషారత్నకుమారి, కేజీబీవీ సిబ్బంది పాల్గొన్నారు.



సెల్ఫ్ డిఫెన్స్‌లో చిట్కాలను వివరిస్తున్న ఎస్సై కళాధర్



ప్రమాదంలో నుజ్జునుజ్జయిన వాహనం

తప్పిన ప్రమాదం

గరుగుబిల్లి: మండల పరిధిలోని పార్వతీపురం–పాలకొండ ప్రధాన రహదారిలో సుంకి గ్రామ సమీపంలో పెనుప్రమాదం తప్పింది. గురువారం శ్రీకాకుళం నుంచి ఒడిశాలోని రాయగడ మజ్జిగౌరమ్మ దర్శనానికి మూడు వ్యాన్‌లతో భక్తులు వెళ్తుండగా, అందులోని ఓ వాహనం స్టీరింగ్ పనిచేయకపోవడంతో అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న చెట్టును ఢీకొట్టింది. దీంతో ఆ వాహనం ముందుభాగం నుజ్జునుజ్జయింది. ఈ విషయం తెలుసుకున్న ఎస్ఐ రమేష్‌నాయుడు సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి వెళ్లగా అప్పటికే ఆ వాహనాన్ని తరలించేశారు.

డీవీఈఓ పరిశీలన

గుమ్మలక్ష్మీపురం: స్థానిక కస్తూరిబాగాంధీ బాలికా విద్యాలయంలో ఇంటర్మీడియట్ విద్యార్థులకు గురువారం నిర్వహించిన యూనిట్ పరీక్షను డీవీఈఓ వై.నాగేశ్వరరావు పరిశీలించారు. పరీక్షల నిర్వహణపై వివరాలను ప్రిన్సిపాల్ సీహెచ్ రంజనిని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యనందివ్వడంతో పాటు వారి ఆరోగ్యంపైనా శ్రద్ధ వహించాలని ఆయన తెలిపారు.

పారిశుధ్యం మెరుగుతో ఆరోగ్యం

గుమ్మలక్ష్మీపురం: పారిశుధ్యం మెరుగుతో ఆరోగ్యమని ఎంపీడీవో పి.త్రివిక్రమరావు అన్నారు. మండలంలోని లక్కగూడ గ్రామ పంచాయతీలో గ్రీన్‌అంబాసిడర్లు చేపడుతున్న చెత్త సేకరణను గురువారం ఆయన పరిశీలించారు. ఇంట్లో బయటపడే చెత్తాచెదారం ఎక్కడపడితే అక్కడ పారవేయకుండా ప్రతిరోజూ ఇంటి వద్దకు వచ్చే గ్రీన్‌అంబాసిడర్లకు అందజేయాలని తెలిపారు. అలాగే ప్రతిఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించడంతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు.



లక్కగూడలో చెత్త సేకరణను పరిశీలిస్తున్న ఎంపీడీవో త్రివిక్రమరావు

సారా రహిత గ్రామాలుగా తీర్చిదిద్దాలి



కురుపాంలోని రెల్లివీధిలో అవగాహన కల్పిస్తున్న ఎక్సైజ్ సీఐ శ్రీనివాసరావు తదితరులు

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): ప్రతి గ్రామాన్ని సారా రహిత గ్రామంగా తీర్చిదిద్దాలని కురుపాం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ సీఐ పి.శ్రీనివాసరావు అన్నారు. నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా ఒకప్పుడు సారా తయారీ, విక్రయాలు విరివిగా జరిగి, ఇప్పుడు అవేమీ లేని జియ్యమ్మవలస మండలంలోని చినబుడ్డిడి, కురుపాం మండల కేంద్రంలోని రెల్లివీధిలను సారా రహిత గ్రామాలుగా ఆయా ప్రాంతాల కమిటీల తీర్మానం మేరకు గురువారం ప్రకటించారు. గతంలో ఆయా ప్రాంతాలకు చెందిన సారా వ్యాపారులు, తయారీదారులు పోలీసులకు పట్టుబడడం, కేసులు పెట్టడం, కౌన్సిలింగ్‌లు ఇవ్వడం ద్వారా వారిలో మార్పు వచ్చిందన్నారు. ఆయన వెంట ఎక్సైజ్ ఎస్సై పి.నరేంద్రకుమార్, చినబుడ్డిడి సర్పంచ్ అలజంగి నారాయణరావు, వీఆర్వో చింతల రామయ్య తదితరులు ఉన్నారు.